పిచ్చితల్లి

'కొన్ని ప్రశ్నలకు సమాధానాలు జీవితకాలంలో దొరకవు. దొరికినా అర్థంకావు...' అనుకునేవాడు రాజేశ్వరరావు.

జీవితం చావుదెబ్బలు కొట్టి నేర్పించిన ప్రాక్టికాలిటీ ముందు సున్నితత్వాలు, స్పందనలు జీవితపు కాసారంలో ఎప్పుడో అట్టడుగుకు వెళ్ళిపోయి ఉంటాయి.

రానురాను బండబారిపోతున్న మనుషుల మధ్య, మెటీరియలిస్టిక్ రియాలిటీ పేరుతో చెల్లుబడి అయిపోతున్న స్వార్థాల మధ్య, అనుభూతుల నిశ్శబ్ద చలమలను గమనించేవారే ఉండరేమో అనుకుంటూ వుండగా అతనికి...

సావిత్రి కనిపించింది... చాలా ఏళ్లకు.

అప్పుడు,

పొడుగాటి జడ, సోగ కళ్లు, రాళ్ల ముక్కుపుడక అంటే చాలా చాలా ఆరాధన రాజేశ్వరరావుకు. ఆమెకు ఆ విషయం చెప్పాలన్న ఉత్సాహం బోలెడు వున్నా, చెప్పే దగ్గరయ్యే ధైర్యం అతనికి బొత్తిగా లేదు.

కానీ, ఆడపిల్లలకు కొన్ని చెప్పకుండానే తెలుస్తాయి. ఆ పిల్ల కళ్లు నవ్వు దాచేవి. సన్నటి పెదవుల మీద తేనెరంగు పుట్టుమచ్చ. వంకర నవ్వు. 'నీ సంగతి నాకు తెలుసులే' అన్నట్లు ఉండేది.

"మీరంటే నాకు చాలా ఇష్టం... నాకే కాదు చాలామందికి..." అని తన భావాన్ని జనరలైజ్ చేసి భయపడుతూనే బైటపెట్టాడు ఒకరోజున.

"ఎందుకట? ఎందుకు నేనంటే ఇష్టం?! ఎందులో నేను మిగతావాళ్లకన్నా వేరని?!" అని సావిత్రి ఎదురొచ్చేటప్పటికి,

ఉక్కిరిబిక్కిరై, చేతిలో వున్న ముంత కింద పప్పు గభాలున నోట్లో పోసుకుని, మరింత గందరగోళంలో పడ్డాడు రాజేశ్వరరావు. ఆ అమ్మాయి ఎన్ని విషయాల్లోనో మిగతావాళ్లకన్నా ప్రత్యేకమైన మనిషి అని తెలిసినా, ఎందుకో చెప్పాలంటే ఇసుకమీద గీతల్లాగా గజిబిజిగా ఉన్నదతనికి.

చాలామంది ప్రేమిస్తున్నామనుకునేవాళ్లకు అసలు ఎందుకు ప్రేమిస్తున్నామో, ఏ గుణం ఎదటి మనిషిని గొప్ప మనిషిగా, విలక్షణమైన వ్యక్తిగా రూపుదిద్దుతోందో చెప్పలేరు.

ఆ తరువాత, ప్రాక్టికల్ జీవితం అంటూ బుద్ధిగా కట్నానికి అమ్ముడుపోయి, సెటిల్ అయిపోయినాడు రాజేశ్వరరావు. కాలం మధ్య జ్ఞాపకాల నీడల్లో సావిత్రి ఛాయ చాలా తక్కువసార్లు తటుక్కుమనేది. స్థూలత్వం దాంభికత, అహంకారం

రూపుదిద్దుకున్న ఆడవాళ్ల ఇల్లాలితనాల మధ్య, వీటికి వ్యతిరేకమైన వ్యక్తి ఉంటుందా? అనుకున్నప్పుడల్లా ఆమె జ్ఞాపకానికి వచ్చేది.

"మా అత్తగారు నన్ను కాపురం చెయ్యనివ్వదు మామయ్యా! నా బతుకింతే..." బోరున ఏడుస్తూ ఐదో నెల కడుపుతో పుట్టింటికి వచ్చిన మేనకోడలు కసితో, రోషంతో చాలా చాలా కథలు చెప్పింది.

"అసలే అత్తగారు... అందులో సవితి తల్లి ఓ ముద్దు, ముచ్చట లేదు. ఏది అత్తగారు ఆలోచించి చెయ్యి అని ఒకటే నస. అమ్మ దేవత... ఆవిడ అన్నీ మంచే చెబుతుంది' అనే నా మొగుడు చేసిందా ఛీ... వెధవ జీవితం..." అని విసుక్కుంటూనే బోలెడు కష్టాలు చెప్పింది ఆ పిల్ల.

'నా కూతురు కాపురం కోల్లేరైపోయింది... త్వరగా రా...' అని అక్కగారి ఎస్.టి.డి. పిలుపు విని వెంటనే వచ్చిన రాజేశ్వరరావుకు ఆ మేనకోడలు అత్తగారి గురించిన కథలు వింటే ఆవిడ అసలు ఊహకు అందలేదు.

ఈ కోడలు పిల్ల తొందరపాటు తెలిసినా, అవతలి మనిషి సామాన్యురాలు మాత్రం కాదు అని అర్థమైంది అతనికి.

ఆవిడ సవితి కొడుకు పెళ్లికి ఏదో అలిగి రాలేదని అందరూ అన్నారు. అందుకే ఆవిడను చూడలేదు రాజేశ్వరరావు.

ఏం మాట్లాడాలో నిర్ణయించుకోకుండానే తప్పనిసరిగా అక్కగారి పోరు పడలేక, మేనకోడలు అత్తవారి ఊరు బైలుదేరాడు.

అప్పుడు... అక్కడ చూశాడు సావిత్రిని ఇన్నేళ్లకు - మేనగోడలి సవితి అత్తగారి హోదాలో.

ఆశ్చర్యపోయాడు రాజేశ్వరరావు ఆమెను చూసి. తనలో వయస్సు కనబడుతోంది. కానీ ఆమెలో పెద్ద మార్పు లేదు - తెచ్చిపెట్టుకున్న గంభీరత, వయసు ఇచ్చిన పెద్దరికం తప్ప.

తనకు ఆనాడు అలా తెలిసిన సావిత్రితో ఈనాడు ఈ విషయాలు ఎలా మాట్లాడాలో బొత్తిగా అర్థంకాలేదు అతనికి.

అతిథి మర్యాదల తరువాత, ముందు ఆవిడ సవితి కొడుకును కదిలించాడు.

"మా అమ్మను ప్రపంచం అంతా సవితి తల్లి అంటుంది. ఆవిడ నాకు అలా కాదండీ... ఆవిడ ఏం చేసినా నా మేలుకోసమే చేస్తోందని నాకు తెలుసు..." అన్నాడు అతను ఖరాఖండీగా...

ఈ విషయాన్ని అసలు ఎలా ప్రస్తావించాలో, ఎలా తేల్చాలో బొత్తిగా అర్థం కాలేదు రాజేశ్వరరావుకు.

కానీ, ఆ బాధ్యత కూడా సావిత్రే నెత్తిన వేసుకున్నది. "ఏమంటోంది మీ మేనకోడలు? మా అత్త గద్దరి రాక్షసి అంటోందా? ఆవిడ చస్తే తద్దినం కూడా పెట్టను అంటోందా?!" నవ్వుతూనే అడిగింది సావిత్రి.

ఆ మాటలన్నీ... అవ్వేమిటి? అంతకన్నా పలుగురాళ్లలాంటి మాటలే మాట్లాడింది మేనకోడలు. కానీ, ఎందుకో ఈవిడ నోట అవి వినలేకపోయాడు రాజేశ్వరరావు.

"ఏమిటి ఆ పిల్ల అసలు గోల?!" అడిగాడు.

ఆలోచిస్తూ చీకట్లోకి చూస్తూ కూర్చున్నది సావిత్రి.

తనపట్ల ఆ పిల్ల ఎంత క్రూరంగా ప్రవర్తించిందో చెప్పలేకపోతోందేమో ననిపించింది అతనికి.

"అసలు నా మేనకోడలు చిన్నప్పటి నుంచీ కొంచెం గద్దరి..." ఇంకా ఏదో అనబోయాడు.

తానేదో తన అక్కకూతురు తరపున వకాలత్ తీసుకోవడానికి వచ్చి ఈవిడ పక్షం మొగ్గుతున్నానని తెలుస్తూనే వున్నది అతనికి. ఏమిటీ బలహీనత?!

"ఆ అమ్మాయినేమీ అనకండి... చాలా అమాయకురాలు.. రండి... భోజనం పెడతాను. అబ్బాయి వచ్చాడు..." అంటూ వంటింట్లోకి వెళ్లింది ఆమె.

ఆశ్చర్యపోయాడు రాజేశ్వరరావు. మామూలు ఆడవాళ్ల తత్వం తెలిసిన అతనికి ఈమె అర్థం కాలేదు. తను మాట్లాడించకుండానే ఆమె మంచిదైపోవడానికి ఇదొక ప్లాన్ ఏమో అనుకున్నాడు.

ఉన్న మూడు రోజుల్లో చాలా స్టడీ చేశాడు. బోలెడన్ని తెలుసుకున్నాడు. మరిన్ని ఎవరూ చెప్పకుండానే అర్థం చేసుకున్నాడు. అన్నింటిలోకీ ఆశ్చర్యం చాలా ఏళ్ల తరవాత అతను టెన్షన్ లేకుండా గడపడం. మొగవాణ్ణి ఇరవై నాలుగు గంటలూ బాధ్యతలు గుర్తుచేసి, గిల్టీగా తయారుచేసి, బతుకు భయం, బరువు తెలియజేసే సంసార వ్యవస్థలో, ఆ ప్రహరీ గోడలన్నీ దాటి ఏదో హాయి అనే వెన్నెల మైదానాల్లో స్వేచ్ఛగా వున్నట్లున్నది అతనికి. ఈ అనుభూతి చాలా తక్కువమంది ఆడవాళ్ల సన్నిధి ఇస్తుంది. ఈ మాట ఆమెతో చెబుదామని ప్రయత్నించాడు కానీ, చెప్పి... ఆ మాటల అర్థాన్ని, అందాన్ని, అనుభూతిని పోగొట్టుకోలేకపోయాడు.

సావిత్రి ఆవిడ అత్తగారి చేతుల్లో, భర్తతోనూ కూడా చాలా చాలా బాధలు పడింది. నిందలు, దుఃఖాలు అనంతం. పుట్టిన ఒక్క బిడ్డను పురిట్లోనే పోగొట్టుకున్నది. ఈ కొడుకు కూడా మొదట్లో చుట్టుపక్కలవాళ్లు, బంధువులు చెప్పిన మాటలు నమ్మి, 'నువ్వు సవితి తల్లివే' అంటూ చాలా హింసించాడు. పరిహసించాడు. కానీ రానురాను ఆమె గుణాలు తెలుసుకుని ప్రేమను పెంచుకున్నాడు.

"వాడి ముఖం, అలా చెప్పాడా వాడు?! వాడికి నా గురించి ఏమీ తెలియదు. వాడికి నా వల్ల భద్రత ఉన్నది, లాభదాయకమని ప్రేమిస్తున్నాడు అంతే... వాడూ ఆ తండ్రి పోలికే..." అన్నది చటుక్కున సావిత్రి.

అవాక్కైపోయాడు రాజేశ్వరరావు. చుట్టుపక్కల మనుష్యులందరూ తనను మమతానురాగాల్తో పూజిస్తున్నారు. వాళ్లు నేను లేకపోతే బతకలేరు. వీళ్లు నేనంటే

పడి చచ్చిపోతారు... అన్న అబద్ధం ముసుగు కప్పుకుని బతికెయ్యడం ఒక వర్గం ఆడవాళ్ల బలహీనతేమో కానీ, అందుకని మరీ ఇంత 'సినికల్'గా కూడా ఉండక్కర్లేదు అనిపించింది అతనికి.

"నా కష్టాలకు, దుఃఖాలకు కారణాలు నాకు తెలుసు రాజేశ్వరరావుగారూ! నా చుట్టూ వుండే మనుషుల మూర్ఖత్వం నాకు ఐడెన్టిటీ క్రైసిస్ తెప్పించడం. యాభై ఎకరాల సుక్షేత్రమైన మాగాణి మా అబ్బాయి తరానికి ఐదు ఎకరాలుగా మార్చిన మూర్ఖత్వం. ఒడియాల్లో వంద రకాలు, అప్పడాల్లో అరవై రకాలూ అంటూ పోటీ పడుతూ ఇంట్లో సంపాదనలేని ఖర్చుకు అలవాటు చేశారు ఆడవాళ్లు. అనవసరపు ఆడంబరాలు, అక్కర్లేని ఖర్చులు, ఎవరో చూస్తారన్న హెచ్చులు – ఇవన్నీ ఈ ఇంటిని ఏ స్థితికి తెస్తున్నాయో తెలిసికూడా నేను మాట్లాడలేకపోయాను. కారణం – గర్తరితనం చెల్లినట్లు కామన్‌సెన్స్ చెల్లకపోవడం. ఆడది ఆలోచించి సలహాలివ్వడం సగటు మొగవాడు భరించలేకపోవడం, మూర్ఖత్వంతో జీవితం పీటముడి పడిపోయినప్పుడు వచ్చే ఐడెన్టిటీ క్రైసిస్ అనుభవిస్తే కానీ తెలియదు.

"కానీ, నా కొడుకు పెద్దవాడౌతున్నకొద్దీ, ఇవన్నీ ఎంత అనవసరమో వాడికి తెలియచెప్పాను, ఎంత దాచుకోవచ్చో నచ్చచెప్పాను. వాడితండ్రి పోయినతరువాత, ఈ శిథిల ఆర్థిక వ్యవస్థలో పునాదులు కూలిపోకుండా మరింత ఆస్తి పెంచి వాడికి ఇచ్చాను. వాడికి నామీద నమ్మకం వచ్చింది. సవితి తల్లిని అన్న అపనమ్మకం పోయింది. నావల్ల వాడికి కష్టం లేదు. పైగా, నా పెద్దరికం వాడిని కాపాడుతుందన్న ధైర్యం. అందుకే వాడు నన్ను ప్రేమిస్తున్నాడు. అంతే..."

రాజేశ్వరరావుకు నవ్వొచ్చింది ఆవిడ ఎనలైజేషన్‌కు. అంతకన్నా నీలో ఏమున్నదో చూసే శక్తి అతనికి వున్నదంటావా? అని అడగబోయి మానేశాడు.

"మరి మీరు అతని పెళ్లికి అలిగి రాలేదని విన్నాను... నిజమా?!"

చటుక్కున్న తలెత్తి చూసింది సావిత్రి ఆ ప్రశ్నకు. "అవును... కానీ, అలిగి రాకపోవడం కాదు... బాధ... మీ అక్కగారి కుటుంబం ఆర్థిక స్థోమత ఏమిటో నాకు తెలుసు. తండ్రి అప్పులపాలు చేస్తే ఉద్యోగం చేస్తున్న కొడుకు మీద ఆధారపడ్డ కుటుంబం అది. లక్ష రూపాయలు పెళ్లికి ఖర్చు చేస్తామన్నారు. అటువంటప్పుడు పెళ్లి ఇంట్లో చేసి, సత్యనారాయణ వ్రతం చేసి, భోజనాలు పెట్టి, మిగతా డబ్బు ఆ పిల్ల పేరుమీద బ్యాంకులో వెయ్యమన్నాను. అది అమానుషంగా కనిపించింది అందరికీ. సవితి తల్లిని కాబట్టి అచ్చట ముచ్చట చూడలేకపోయానన్నారు. నా కొడుకు కూడా ఊరేగింపు సరదాలకు, లాంఛనాల ఆడంబరాలకు లొంగిపోయి 'ఒక్కసారేకదమ్మా పెళ్లి జరిగేది...' అంటూ సిద్ధపడిపోయాడు. పిల్లనిచ్చేవాళ్ల కష్టం తెలియని వీడిని అల్లుడిని చేసుకోవడానికి తీసుకువచ్చిన అప్పుకు ఇంకా వడ్డీ కూడా సరిగ్గా కట్టలేకపోతున్నాడు మీ మేనల్లుడు. కళ్లముందు జరగబోయే ఈ అనవసరపు ఖర్చు భరించలేకే నేను రాలేదు."

ఆమె గొంతులో పదునుకు, సాంఘిక చైతన్యం పట్ల ఆమెకు వుండే అవగాహనకు ఆశ్చర్యపోయాడు రాజేశ్వరరావు. మరికొన్నిక్షణాల్లో మరింత పెద్ద షాక్ ఇచ్చింది సావిత్రి.

"నేను పడ్డ దుఃఖాలు, మూర్ఖత్వానికి బలై అనుభవించిన కష్టాలు, నా కోడలుకు వుండకూడదనుకున్నాను రాజేశ్వరరావుగారూ! ఎందుకో తెలుసా?! ఆ పిల్ల సాటి ఆడపిల్ల. మామూలుగా వుండే ఏ ఆడపిల్లకూ సాధారణంగా తనను ఎందుకు ఎలా గౌరవిస్తారో తెలియదు. తన అందం, శారీరకంగా తన అవసరం, తన అదృష్టం - ఈ మూడు మాత్రమే అర్థమయ్యేట్లు పెంచుతున్నాం ఆడపిల్లల్ని. అలా ఆమె ఒక హోదాగా, ఒక తప్పనిసరి బాధ్యతగా తయారవడం నాకు ఇష్టం లేదు. అందుకనే నా కోడలుకు చాలా చాలా చెప్పాలని. ప్రయత్నించాను. చదువుకోమన్నాను. పార్ట్ టైం జాబ్ చెయ్యమన్నాను. వాయిస్ కల్చర్ నేర్చుకోమన్నాను. డ్రస్ సైన్స్ హుందాతనం ఆమెలో పెరగాలని ప్రయత్నం చేశాను. మామూలుగా పెరిగిన ఆడపిల్ల కదా! నా ఆలోచనలు అర్థమవడానికి టైం పట్టచ్చు. ఈ కొత్తగా పెళ్ళైన పిల్లలంతా, పిల్లల్ని కనడమే తమ సంసారానికి ఇన్సూరెన్స్ పాలసీ అనుకుంటారు. ఇంకా ఎదగక్కర్లేదనుకుంటారు. కొద్దిరోజుల తరువాత గుర్తింపులేక నరకయాతన పడతారు."

అవాక్కైపోయాడు రాజేశ్వరరావు.

ఇవన్నీ... ఈ నేర్పరితనమే తన మేనకోడలికి సవతి అత్తగారు పెట్టే కష్టాలుగా కనిపించాయన్నమాట!

"తనకు మీరు అర్థమై వుండరు సావిత్రీ!" నసుగుతూ అన్నాడతను.

'హం!' నిర్లిప్తంగా నవ్వింది ఆమె.

"ఏ ఆడది సాటి ఆడదానికి సంపూర్ణంగా ఎప్పుడు అర్థమైందికనక?! మొగవాడు ఆడదాన్ని తన కోణం నుంచి చూసి, తన అవసరాల వరకే గుర్తిస్తాడు. కానీ స్త్రీ మరొక స్త్రీని బైటపడే ఎమోషన్స్, పరిస్థితుల్నిబట్టికాక, జెలసీ, కాంప్లెక్సులు లేకుండా కుతూహలంతో స్టడీచేస్తే కనబడని భావాలు, అర్థాలు బోలెడు నేర్పిస్తాయి."

అలా ఆమె చాలా మాట్లాడింది. వింటూ కూర్చున్నాడతను. సాధారణంగా గడిపేస్తున్న ఈ జీవితంలో ఎన్ని వింత కారణాలున్నాయో ఆమెతో మాట్లాడుతుంటే అర్థమైంది అతనికి.

ఇలా తన ఇంట్లో ఆడవాళ్లెవరూ ఆలోచించరేం? భయమా? అవసరం లేకపోవడమా? తన భార్య, అక్క, కూతురు, మేనకోడలు - ఒకరేమిటి? అసలు ఇలా మాట్లాడితే తనే భరించగలడా?.

ఉలిక్కిపడ్డాడు రాజేశ్వరరావు.

"రాజా!"

బయలుదేరుతున్న అతను ఉలిక్కిపడ్డాడు ఆ పిలుపుకు... ఏనాటి పిలుపు అది?!

"ఇదుగో... ఈ పదివేలు ఆ పిల్ల పురిటి ఖర్చుకు, మా వాడికి పెట్టుబడులకు ఖర్చుపెట్టమని మీ అక్కయ్యకు ఇవ్వండి. లేకపోతే నా కొడుకు దృష్టిలో ఆ పిల్ల పుట్టింటి వాళ్లమీద గౌరవం పోతుంది. ప్రేమ, ఆప్యాయతలకన్నా పెట్టుపోతలమీద ఆధారపడి సాగే సంసారాలు మనవి. ఇదంతా మార్చాలని నా ప్రయత్నం... నా కోడలుకు నా ఆశీర్వచనాలని చెప్పండి... తనింటికి తనను త్వరగా రమ్మన్నానని చెప్పండి..."

కళ్లు చెమర్చాయి రాజేశ్వరరావుకు. ఎంత పిచ్చితల్లి ఈమె?! ఎవరికి ఈమె అర్థమౌతుంది?! ఇలాంటి కరుణామూర్తులైన ఇల్లాళ్లు ఎంతమంది వున్నారు ఈ నా దేశంలో?! సాటి ఆడదాన్ని రక్షించాలన్న జ్ఞానమే అపురూపమైన ఈ కాలంలో ఆమెను ఎలా రక్షించాలో, ఎలా బతికించుకోవాలో తెలిసినవాళ్లెంతమంది?! ఈమె గురించి తను తనవాళ్లకు ఎలా, ఏమని అర్థమయ్యేట్లు చెప్పగలడు?!

'నా గురించి ఏం తెలుసునని ఇష్టపడుతున్నారు?' అన్న ముప్పైఏళ్లక్రితం నాటి సావిత్రి ప్రశ్నకు ఇప్పుడు అతనికి సమాధానం దొరికింది.

వెనక్కు తిరిగి "వెళ్లివస్తాను" అని చేతులు జోడించి నమస్కరించి, ఒక రకమైన నిశ్చింతతో అడుగు బైటకువేశాడు రాజేశ్వరరావు.

('ఈనాడు' ఆదివారం – జనవరి 21, 1996)